సాక్షి శ్రీకాకుళం

బుధవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2024



సిలబస్ గందరగోళానికి తెర

టెన్త్ పరీక్షలపై విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. సిలబస్‌పై గందరగోళానికి తెర దించింది.

- 8లో



సాయం అందించాల్సిందే..

రైతులకు పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘ నాయకులు కోరుతున్నారు. వినతి పత్రాలు సమర్పించారు.

- 8లో

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజ్‌లో ఉపాధి శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల పేషెంట్ రిలేషన్ అసోసియేట్ శిక్షణకు డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 8897252449, 8247656581లను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా స్వప్నవాహిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఇన్‌చార్జి బాధ్యతలను బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.స్వప్నవాహినికి అప్పగించారు. ఆమె పాలనా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఎమ్మెస్సీ మెడికల్ బయో టెక్నాలజీలో స్పాట్ అడ్మిషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలలో ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీలో మిగులు సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్, అప్లైడ్ సైన్సెస్ హెచ్ఓడీ డాక్టర్ ఎం.ప్రదీప్ తెలిపారు. జీవశాస్త్రం సబ్జెక్ట్‌తో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఏపీ పీజీసెట్ 2024 రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత అన్ని దరఖాస్తులు పరిశీలిస్తారని, మెరిట్ ఆధారంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుమతితో అడ్మిషన్లు నిర్వహిస్తారని సూర్యచంద్ర, ప్రదీప్ పేర్కొన్నారు. అయితే స్పాట్ అడ్మిషన్‌లో ప్రవేశం పొందే అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని, స్వల్పంగా నిర్దేశించిన ప్రోగ్రాం మొత్తం ఫీజును కట్టాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. మరిన్ని వివరాల కోసం 8555911961, 7702203953, 6301096643 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రోగులతో కొత్తూరు సీహెచ్‌సీ కిటకిట



రోగులతో కిటకిటలాడుతున్న కొత్తూరు సీహెచ్‌సీ

కొత్తూరు: కొత్తూరు సీహెచ్‌సీ రోగులతో కిటకిటలాడుతోంది. ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి పలువురు రోగాలు బారిన పడుతున్నారు. ఎక్కువ మంది వైరల్ ఫీవర్లతో బాధపడుతున్నారు. కొత్తూరు సీహెచ్‌సీకి రోజుకు సుమారు 250 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. అందులో సుమారు 150 మంది వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్‌తో బాధ పడుతున్న వారు ఉన్నారు. డయేరియా బాధితులు కూడా కనిపిస్తున్నారు. వర్షాల వల్ల జ్వరాలు వస్తున్నట్లు సూపరింటెండెంట్ చెప్పారు.

రిమ్స్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల ఆందోళన



రిమ్స్‌లో ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సులు

శ్రీకాకుళం: స్టాఫ్ నర్సులకు నష్టం కలిగించే 115 జీఓను రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని రిమ్స్‌లోని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు హెచ్చరించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 115ను వ్యతిరేకిస్తూ మంగళవారం రిమ్స్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. కొన్నేళ్లుగా తామంతా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తుంటే తమను కాదని ఏఎస్ఎంలను రిమ్స్‌కు తీసుకురావాలనుకోవటం సరైన నిర్ణయం కాదన్నారు. జీఓ నంబర్ 115ను తక్షణమే రద్దు చేసి తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరంతా రిమ్స్ ఆవరణలో నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. రిమ్స్ సూపరింటెండెంట్‌కు వారి డిమాండ్లను తెలియజేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు.

ఐటీఐ పూర్తి చేసిన యువతకు ఉద్యోగావకాశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: అశోక లేలాండ్ కంపెనీ వారు నేరుగా నిర్వహించే ఉద్యోగ మేళాను ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కంచరపాలెం ఐటీఐలో ఈ ఉద్యోగ మేళా ఉంటుందని, ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో పెయింటర్ ట్రేడులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. దుబాయి, యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో సైతం ఆ కంపెనీ బ్రాంచ్‌ల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. జీతం, వసతి, భోజనం కల్పిస్తారని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యం ఆధారంగా నేరుగా కంపెనీ ఎంపిక చేస్తుందని తెలిపారు.

నీరు.. కన్నీరు



ఆమదాలవలస వెంగళరావు కాలనీలో కూలిన పూరింటిలో బాధిత మహిళ

- వాయుగుండంతో భారీ నష్టం
- వర్షాలు తెరిపిచ్చినా వదలని వరద
- నదులు, వాగులు, చెరువులు పొంగి ప్రవహించడంతో పంట పొలాలు నీట మునక
- 70కిపైగా విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- పలు చోట్ల రోడ్లు ధ్వంసం

వాయుగుండం అన్నదాత ఆశలకు గండి కొట్టింది. ఈ సీజన్‌లోనే అత్యధిక వర్షపాతం నమోదైనా.. వెంటనే వచ్చిన వరదలతో నదీతీర ప్రాంతాల్లో వేలాది ఎకరాల పంట ముంపునకు గురైంది. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. రోడ్లు కూడా పలు చోట్ల ధ్వంసం కావడంతో రాకపోకలు ఆగిపోయాయి. రోడ్లు, భవనాల శాఖతో పాటు పంచాయతీ రాజ్ శాఖల పరిధిలో నష్టాలు వాటిల్లాయి.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ/ఎచ్చెర్ల క్యాంపస్/నరసన్నపేట/ఎల్ఎన్ పేట/కవిటి/కంచిలి/మెళియాపుట్టి/పాతపట్నం/కొత్తూరు/పొందూరు/ఆమదాలవలస/ఎచ్చెర్ల/హిరమండలం/జి.సిగడాం



పొందూరు మండలం తాడివలసలో సోమవారం నీట మునిగిన పంటపొలాలు



కొత్తూరు: కడుము కాలనీలో కుప్పకూలిన పూరిల్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలు ఎక్కడికక్కడ నష్టాలు తెచ్చి పెట్టాయి. శని, ఆదివారాల్లో జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడగా, సోమవారం ఇచ్ఛాపురం, పలాస, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో వర్షాలు కురిశాయి. తాజాగా కురిసిన వర్షాలు ఇటీవల కాలంలో అత్యధికం కావడంతో వాగులు, గెడ్డలు వరద నీటితో పోటెత్తాయి. వరద ఉధృతికి సమీపంలో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. అటు ఒడిశాలోనూ, ఇటు జిల్లాలోనూ కురిసిన వర్షాలకు వంశధార, నాగావళి, బాహుద, మహేంద్రతనయ నదులు పొంగి ప్రవహించాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి.

- మొదటి రెండు రోజులు వాన ఇచ్ఛాపురం నియోజకవర్గం మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లోనూ భారీగా కురిసింది.



ఎల్.ఎన్.పేట: కడపలవాని గెడ్డపై రాకపోకలు నిషేధిస్తూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- ప్రస్తుతం జిల్లాలో వర్షం తెరిపిచ్చినా ఇంకా పంట పొలాలు నీట మునిగే ఉన్నాయి.
- పొలాల్లో ఉన్న నీరును చూసి రైతులు తల్లడిల్లుతున్నారు.
- వరి, మొక్కజొన్నతో పాటు కూరగాయల పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.
- విద్యుత్ శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో 70 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 26 ట్రాన్స్‌ఫార్మర్లు కూడా దెబ్బతిన్నాయి. వీటి నష్టం రూ.45లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేశారు.



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బహుదానది

- వరద తాకిడికి జిల్లాలో నాలుగు కల్వర్టులు ఏకంగా కొట్టుకుపోయాయి. వీటిని నిర్మించాలంటే రూ. 30లక్షలకు పైగా ఖర్చు కానుంది.

నీటమునిగిన పంట విస్తీర్ణం	1230 హెక్టార్లు (అధికారిక లెక్కల ప్రకారం) / 3000 హెక్టార్లు (అనధికార లెక్కల ప్రకారం)	దెబ్బతిన్న చెరువులు 36	విద్యుత్ శాఖకు నష్టం రూ.45 లక్షలు	రహదారుల తాత్కాలిక మరమ్మతులకు అయ్యే వ్యయం రూ.3.75 కోట్లు	జిల్లా వ్యాప్తంగా నేలమట్టమైన ఇళ్లు 50

- సోమవారం ఇచ్ఛాపురంలో వాన దంచికొట్టింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. వాగుల వరదనీరు రోడ్ల పైకి వచ్చేసింది.



కంచిలి : ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి ప్రవేశిస్తున్న వరద నీరు (ఫైల్)

- భారీ వర్షాలకు పలు చోట్ల చెట్లు నేలకొరగగా, మరి కొన్ని చోట్ల ఏకంగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50కి పైగా ఇళ్లు కూలినట్టు తెలుస్తోంది. తడిచి ముద్దయి కూలిన ఇళ్ల లెక్క మరింత పెరగొచ్చు.



- ఆర్ అండ్‌బి, పంచాయతీరోడ్లు ధ్వంసమయ్యాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో 165 కిలోమీటర్ల పొడవున 50కి పైగా రోడ్లు పాడవ్వగా, పంచాయతీరాజ్ పరిధిలో 35కిలోమీటర్ల పొడవునా 8 రోడ్లు ధ్వంసమయ్యాయి. వీటిని తాత్కాలిక పనులతో పునరుద్ధరించాలంటే రూ.3.75కోట్ల మేర ఖర్చు అవుతుంది. శాశ్వత పనులకైతే రూ.100కోట్లు దాటిపోనుంది.



రాష్ట్రస్థాయి జాతరగా కొత్తమ్మ తల్లి ఉత్సవం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి జాతరను ఇకపై రాష్ట్రస్థాయి జాతరగా నిర్వహించేందుకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ జరగనున్న కొత్తమ్మ తల్లి ఉత్సవ నిర్వహణకు గాను రూ.కోటి నిధులను కూడా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన సిఫార్సు మేరకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారని ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు.

ఇసుక విధానం ▶ దోపిడీ ప్రధానం

- మోసపోతున్న వినియోగదారులు
- ప్రభుత్వం తీరుతో దొరకని ఇసుక
- ప్రకటనలకే పరిమితమవుతున్న ఇసుక సరఫరా
- ఇసుక మాఫియాను ఆశ్రయించాల్సిన పరిస్థితి
- టీడీపీ నాయకులకు కాసులు కురిపించే స్కీమ్‌గా మారిన ఉచిత ఇసుక విధానం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఇసుకలో కాసుల వేట సాగుతోంది. ఉచితం అని చెప్పినా ఎక్కడా దొరక్కపోవడం.. ఇసుక కావాలంటే మాఫియాను మాత్రమే సంప్రదించాల్సి రావడం, అనధికారిక ర్యాంపులన్నీ అధికార పక్ష నేతల గుప్పిట్లో ఉండడంతో ఇసుక వారికి కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వం ఇసుకను సరఫరా చేయకుండా జాప్యం చేస్తూ తమ పార్టీ నాయకులకు పరోక్షంగా లబ్ధి చేకూరుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండే రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ప్రారంభించింది. అది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తవ్వి తీసిన ఇసుకతోనే ఆర్భాటం చేసింది. ఆ ఇసుక కూడా జూలై 26 తేదీకే విక్రయం జరిగిపోయింది. అంటే దాదాపు 47రోజులు కావస్తున్నా జిల్లాలో అధికారికంగా ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. ఇదిగో అదిగో అని కాలయాపన చేసి చివరకు సెప్టెంబర్ 11న (నేడు) ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రకటించింది. ఆ ప్రకటన కూడా అమలు జరగడం లేదు. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన ఇసుక విక్రయాలకు ఒక్క స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయలేదు.

ఉచితం పేరుతో పరాచకాలు

ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నో చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుకను అమ్ముకుంటోందని.. తామొస్తే ఉచితంగా ఇస్తామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఉచితం పక్కన పెడితే గత ప్రభుత్వంలో కన్న ఎక్కువగా ఇసుకను విక్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో అధికారికంగా సేకరించి ఉన్న ఇసుకను స్టాక్ పాయింట్‌గా పెట్టి ఈ ప్రభుత్వం అమ్ముకుని సొమ్ము చేసుకుంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన అంగూరు, టెక్కలి స్టాక్ పాయింట్‌లో జూలై 26వ తేదీకే ఇసుక విక్రయాలు పూర్తయిపోయాయి. నాటి నుంచి నేటి వరకు జిల్లాలో అధికారిక ఇసుక స్టాక్ పాయింట్లు లేవు. దీంతో ఇసుక కోసం వినియోగదారులు అక్రమార్కులను ఆశ్రయించాల్సి వస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టగలిగేవాళ్లు టీడీపీ దళారుల వద్ద కొనుగోలు చేసుకుంటుండగా, అంత ఖర్చు పెట్టలేని వా ళ్ల నిర్మాణాలు నిలిపేసి ప్రభుత్వం సరఫరా చేస్తామన్న ఇసుక కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో ప్రస్తుతం భవన నిర్మాణం రంగం కుదేలైంది. జిల్లాలో లక్షా 20వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఇసుక సమస్య తీవ్రంగా మారింది.

దగా.. దగా..

ఇదిగో అదిగో అంటూ అధికారులు ప్రకటనలు చేయడం తప్ప అధికారికంగా ఇసుక సరఫరా చేయడం లేదు. దాదాపు 47 రోజులుగా అధికారికంగా ఇసుక దొరకడం లేదంటే ఈ ప్రభుత్వ తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫలానా తేదీల్లో.. ఫలాన స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక విక్రయిస్తామని చెప్పడం...ఆ తేదీలు వచ్చేసరికి చేతులేత్తేయడం తప్ప మరొకటి కనిపించడం లేదు. పరోక్షంగా టీడీపీ నాయకుల ర్యాంపులనే చూసుకోండని సంకేతాలిస్తోంది.

వారి ర్యాంపులే దిక్కు

అధికారికంగా స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయకపోవడంతో ఇసుక అక్రమ దందా సాగిస్తున్న టీడీపీ నాయకులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకుని అధికార పార్టీ నాయకులు దర్జాగా ర్యాంపులు ఏర్పాటు చేసుకుని ఇసుక విక్రయాలు జరుపుతున్నారు. ముఖ్యంగా బూర్జ మండలం నారాయణపురం, చిన అంకలాం ,శ్రీకాకుళం రూరల్ పరిధిలోని భైరి, కరజాడ, కళ్లేపల్లి, కిల్లిపాలెం, బట్టేరు, బూరవల్లి, లొద్దలపేట, సింగూరు, నైరాతో పాటు గార, పొన్నాం, ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, తొగరాం, బెలమం, కొత్తవలస, పొందూరు మండలం సింగూరు, నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని మడపాం, లుకలాం, బుచ్చిపేట, చేనులవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, పర్లాం, దొంపాక, ఉర్లాం పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు, హిరమండలం మండలాల్లో అనధికారంగా నడుస్తున్న ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక అక్రమంగా కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. రాత్రిపూటే ఈ దందా నడుస్తోంది. ఒక్కో లారీకి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నారు. రోజుకి రూ.నాలుగైదు కోట్ల వ్యాపారం జరుగుతోంది.

11 నుంచి ఇసుక విక్రయాలు ఉత్తిదే..

సెప్టెంబర్ 11 నుంచి నూతన ఇసుక విధానం అమలవుతుందని, ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు ఇసుక విక్రయిస్తారని చేసిన ప్రకటన కూడా కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలో ఎక్కడా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయలేదు. బుధవారం నుంచి కొత్త విధానంలో భాగంగా ఇసుక అందుబాటులో ఉండే పరిస్థితి లేదు.

పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం




తోటపల్లి ప్రాజెక్టు పరిస్థితి

గరుగుబిల్లి: కురుస్తున్న వర్షాలకు, ఒడిశాలో కురిసిన వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం మరింత పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద సోమవారం సాయంత్రానికి 3,710 క్యూసెక్కులున్న నీటి ప్రవాహం మంగళవారం సాయంత్రానికి 4,824 క్యూసెక్కులకు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 9,056 క్యూసెక్కుల వరద నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువలద్వారా 490 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రస్తుతం నదిలో 104.02 మీటర్లలో నీరు నిల్వ ఉంది.

పెరిగి తగ్గుతున్న వంశధార

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద 30,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గత మూడురోజులుగా పడిన వర్షాలకు గొట్టా బ్యారేజీ వద్ద వరద నీరు నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 10 గంటల వరకు 10,686 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మధ్యాహ్నం 1గంట సమయానికి ఒక్కసారిగా 30,500 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో వంశధార అధికారులు అప్రమత్తమై 19గేట్లు 40 సెంటీమీటర్లు పైకి ఎత్తి దిగువ నదిలోకి విడిచిపెట్టారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి 25823 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గింది. రాత్రి 8 గంటలకు 22356 క్యూసెక్కులకు చేరింది. వంశధారలో పెరిగిన వరద పరిస్థితిని టెక్కలి ఆర్డీఓ సుదర్శనదొర పరిశీలించారు.



బ్యారేజీ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరదనీరు

ఉత్సవం.. ఉత్సాహం



గణపతి ఉత్సవాల్లో భాగంగా వినూత్న ఆలోచనలతో ప్రతిమలు ఏర్పాటు చేశారు. నవరాత్రుల సందర్భంగా చిన్నారులు మండపాల వద్ద ఆటపాటలతో సందడిగా గడుపుతున్నారు. వారి వేషధారణలు అలరిస్తున్నాయి.

– కాశీబుగ్గ

న్యూకాలనీలో ఊయల ఊగుతున్న గణనాథుడు



అంబేడ్కర్ నగర్‌లో వేషధారణలతో చిన్నారులు

క్లుప్తంగా

కొట్లాటలో ఇద్దరికి గాయాలు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామంలో ఇరువర్గాల మధ్య వ్యవసాయ భూమి విషయమై కొట్లాట జరిడింది. ఒకరిపై ఒకరు కత్తులతో దాడులు చేసుకోవడంతో జాయి అప్పలనాయుడు, అగతమూడి ప్రభావతిలు తీవ్రంగా గాయపడ్డారని ఎస్‌ఐ ఎంఏ అహమ్మద్ చెప్పారు. బాధితులకు స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

దుర్గాదేవి ఆలయంలో చోరీ



ఆలయం తలుపులు తెరిచి ఉన్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: దోమాం పంచాయతీ కొంచాలకుర్మయ్యపేట దుర్గాదేవి ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి తాళాలు బద్దలగొట్టి గుడి తలుపులు తీసి బీరువా పగలుకొట్టారు. అమ్మవారికి అలంకరించిన ఆరు కిలోల వెండి, తులం బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. మంగళవారం ఆలయం తెరిచేందుకు వెళ్లగా తాళాలు బద్దల కొట్టి ఉండటంతో ఆలయ ధర్మకర్త బచ్చు నర్సింగ రెడ్డి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

13 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–14, 17, 19 బాల బాలికలకు జిల్లా స్థాయి ఎంపిక తేదీలను స్కూల్ గేమ్స్ అధ్యక్షుడు, డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, కార్యదర్శి బీవీ రమణ మంగళవారం వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 30 వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో వివిధ జిల్లాల్లో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పంపిస్తామన్నారు. అండర్–14 విభాగానికి 2011 జనవరి ఒకటి తర్వాత, అండర్–17 విభాగానికి 2008 జనవరి ఒకటి తర్వాత , అండర్–19 విభాగానికి 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు.

వారి నేత్రాలు సజీవం



సావిత్రమ్మ



సీపాన భుజంగరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పంచాయతీ సాయినగర్ కాలనీకి చెందిన ఉప్పలపాటి సావిత్రమ్మ (70) మంగళవారం మృతి చెందారు. ఈమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయాలని నిర్ణయించి రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే నేత్ర చికిత్స నిపుణులు సుజాత బృందం ఎచ్చెర్లలో సావిత్రమ్మ ఇంటికి వచ్చి కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు అభినందించారు. నేత్ర దానం చేయాలనుకుంటే 7842699321 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. బూర్జ మండలం తోటవాడ గ్రామానికి చెందిన సీపాన భుజంగరావు(70) మృతి చెందడంతో కుమారులు ఎస్.ధనుంజయరావు, ఎస్.సురేష్, డి.సత్యనారాయణలు నేత్రదానానికి అంగీకరించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది వచ్చి కార్నియా సేకరించారు.

వృద్ధురాలి ఆచూకీ కోసం గాలింపు



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సూచనలిస్తున్న తహసీల్దార్

పోలాకి(నరసన్నపేట): మండలంలోని కొల్లివలస వద్ద ముప్పిడి గ్రామానికి చెందిన దొంకాన లక్ష్మీదేవి పోలాకి ఓపెన్ హెడ్ చానెల్లో రెండు రోజుల కిందట గల్లంతయ్యారు. ఈమె ఆచూకీ కోసం మంగళవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. తహసీల్దార్ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని బన్నువాడ గ్రామానికి చెందిన ఎన్ని గణపతిరావు ఈ నెల 1న కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం బెల్టుషాపుపై దాడి

టెక్కలి రూరల్: స్థానిక భవానీనగర్ సమీపంలో పాన్ షాపు పేరుతో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపుపై పోలీసులు మంగళవారం దాడిచేశారు. 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్మకాలు సాగిస్తున్న గూడ తవుడు, అంకులపిట్ట పూర్ణచంద్రలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సిలబస్ గందరగోళానికి తెర

- టెన్త్ పరీక్షలపై స్పష్టతనిచ్చిన విద్యాశాఖ
- రెగ్యులర్ విద్యార్థులకు నూతన సిలబస్ ప్రకారమే పరీక్షలు
- పూర్వ విద్యార్థులకు మాత్రం పాత సిలబస్‌తో నిర్వహణ



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల పరీక్షలు, ప్రశ్నపత్రాలపై నెలకొన్న గందరగోళంపై విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తాజాగా మార్గదర్శకాలు జారీ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2025 మార్చిలో, సప్లిమెంటరీ పరీక్షలు 2025 మే నెలలో జరుగుతాయని విద్యాశాఖ పేర్కొంది. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే సిలబస్‌ను మార్చిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే పాఠ్యపుస్తకాల ముద్రణ, పంపిణీ జరిగింది. కొత్త సిలబస్ ప్రకారం నమూనా(మోడల్) ప్రశ్నపత్రాలను బీఎస్‌ఈఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో విద్యాశాఖ పొందుపర్చింది. ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే నూతన సిలబస్, పాఠ్యపుస్తకాల ప్రకారం ప్రశ్నపత్రాలుంటాయని స్పష్టం చేసింది.

వీరికి మాత్రం పాత సిలబస్ ప్రకారమే..

ప్రస్తుత విద్యా సంవత్సరానికి ముందు చదివి ఫెయిలైన/పరీక్షలకు హాజరుకాని విద్యార్థులకు మాత్రం పాత సిలబస్‌తోనే ప్రశ్నపత్రాలు రూపొందుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు. 2023–24, 2022–23, 2021–2022, అంతకు పూర్వం బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు మార్చి, మే–జూన్ వార్షిక, సప్లమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన వారికి, రీఎన్‌రోల్/విత్‌హెల్డ్/మాల్‌ప్రాక్టీస్ విద్యార్థులకు పాత సిలబస్సే వర్తించనుంది.

టీచర్లు, హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలి..



విద్యార్థులను పరీక్షకు సన్నద్ధం చేసే విషయమై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. వారు చదువుకున్న సమయంలో ఉండే సిలబస్, పాఠ్యపుస్తకాల ఆధారంగానే పరీక్షలు జరుగుతాయనే విషయాన్ని తెలియజేయాలి. అందుకు అనుగుణంగా పరీక్షలకు సమాయత్తం చేయాలి. విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ బీఎస్‌ఈఏపీ.జీవోవి.ఇన్‌లో ఉన్న మోడల్ ప్రశ్నపత్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

అచ్యుతాపురం సెజ్ బాధితునికి సాయం



నారాయణరావుకు చెక్ అందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట/సారవకోట: అచ్యుతాపురం సెజ్ ప్రమాదంలో బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సారవకోట మండలం మహాసింగి పంచాయతీకి చెందిన కొండాల నారాయణరావు ఆగస్టు 21న ఎసైన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెక్కు రూపంలో రూ.లక్ష పంపించగా మంగళవారం నారాయణరావు నివాసముంటున్న విశాఖ జిల్లా వడ్లపూడి గ్రామంలోని ఇంటికి వెళ్లి కృష్ణదాస్ స్వయంగా అందించారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ అధ్యక్షుడు నక్క తులసీదాస్, మాజీ సర్పంచ్‌లు పల్లి కృష్ణ, యాళ్ల శ్యామ్ సుందర్, మహాసింగి సర్పంచ్ కురిటి రంజిత్, నాయకులు పారశెల్లి తేజేశ్వరరావు, బూర్లె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అకాడమీకి విద్యార్థి ఎంపిక



వంశీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రం పరిధిలోని శాస్త్రులపేట (అంపోలు) ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆర్.వంశీ ఇటీవల నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో స్పోర్ట్స్ స్కూల్ అకాడమీలో సీటు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.అనురాధ మంగళవారం తెలిపారు. 14 నుంచి 16 ఏళ్ల విద్యార్థులకు ఈ నెల 1న విశాఖ పోర్టు స్టేడియంలో వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. వంశీ అత్యధికంగా స్కోర్ చేయడంతో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉచిత వసతితో పాటు విద్యాభ్యాసం కూడా ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ అభినందించారు.

ఉత్సాహంగా టెన్నికాయిట్ ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో ఫెడరేషన్ సభ్యులు

కాశీబుగ్గ: రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు హాజరయ్యే జిల్లా జట్టు ఎంపికలు మంగళవారం పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలురు జట్టుకు టి.వెంకటేష్, జయంత్, అభిరామ్, భార్గవ్, బాలికల జట్టుకు శ్రావణి, వరలక్ష్మి, పవిత్ర ఎంపికైనట్లు జిల్లా టెన్నికాయిట్ సంఘం కార్యదర్శి వి.జోగారావు ప్రకటించారు. కార్యక్రమంలో మల్లా భద్రయ్య, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.చిట్టిబాబు, టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పి.తవిటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, సునీత, దామోదర్, రామయ్య, షాజహాన్ పాల్గొన్నారు.

నష్టం వివరాలు తెలియజేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వర్షాల వల్ల కలిగిన నష్టం వివరాలను బుధవారం నాటికి అందజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ, వ్యవసాయం , పంచాయతీరాజ్, డ్వామా, గృహ నిర్మాణ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల అంశాలపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు వచ్చే ప్రతీసారి కంట్రోల్ రూం ఫోన్ మార్చకుండా శాశ్వతంగా నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, సీపీఓ లక్ష్మీప్రసన్న, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, డ్వామా పీడీ చిట్టిరాజు, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాల్సిందే

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేఆర్ పురం గ్రామ సచివాలయ కార్యదర్శి ఆదినారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధర రైతులకు అందేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కరువు, వరదల కారణంగా నష్టపోయిన పంటలకు బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. తోటపల్లి కాలువ పూడికలు తీసి తోటపల్లి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు రూ. 2లక్షలు రుణమాఫీ చేయాలని కోరారు. యాజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిక్కోలు పోరాట యోధుడు కుమారన్న



మాట్లాడుతున్న తాండ్ర ప్రకాష్

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట యోధుడు పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న వర్ధంతి సభ మంగళవారం లొత్తూరు పంచాయతీ పెదగంతరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూఅమరుల త్యాగాల బాటలో నేటి తరం నడుచుకొని గిరిజన హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కుమారన్న జయక్క స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పి.ఓ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సవలాపురపు కృష్ణవేణి, కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతలపల్లి కుసుమ, ప్రజాసంఘాల నాయకులు అరుణ, నీలకంఠం, సన్యాసిరావు, నేతింటి నీలంరాజు, కుత్తుం వినోద్, బర్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన టీచర్‌పై ఫిర్యాదు

టెక్కలి రూరల్: టెక్కలి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న తమ కుమారుడు మోక్షిత్‌ను ఉపాధ్యాయుడు పల్లి వేణుగోపాల్‌రావు తీవ్రంగా కొట్టారంటూ విద్యార్థి తల్లిదండ్రులు సుధీర్, సుకన్యలు మంగళవారం ఎంఈఓ దల్లి తులసీరావుతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోమ్‌వర్క్ చేయలేదని విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంఈఓ వద్ద ప్రస్తావించగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేస్తే సహించేది లేదని జ్యోతిరావు పూలే ఓబీసీ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ఎంతోమంది ప్రాణత్యాగాలతో సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు అన్ని రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని, ఈ పోటీలకు డిగ్రీ చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టీమ్‌లో కనీసం ఇద్దరు విద్యార్థులు ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో గెలిచిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి విజేతలకు రూ.1.50లక్షలు, తృతీయ బహుమతి గెలుచుకున్నవారికి రూ.లక్ష బహుమతిగా ఇస్తామని, అలాగే జోనల్ రౌండ్‌లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతియ బహుమతి రూ.3లక్షలు ఇస్తామని, అదేవిధంగా జాతీయ స్థాయిలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు ఇస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇది పూర్తిగా ఉచితమన్నారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు బైక్‌పై వెళుతున్న దంపతులు రాంబాబు, సాయిమౌనికలను కుశాలపురం పంచాయతీ నవభారత్ సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో గాయపడ్డ వీరిని 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. రిమ్స్ ఔట్ పోస్టు సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

సచివాలయం మార్పుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



దండేవలసలోని కొత్త సచివాలయం భవనం

ఆమదాలవలస: మండలంలోని దండేవలస, చింతలపేట, బొబ్బిలిపేట గ్రామాలకు చెందిన గ్రామ సచివాలయం మార్పుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దండేవలసలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని జనవరి 1న ప్రారంభించడంతో సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అక్కడైతే అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంటుంది. అయితే ఇటీవల టీడీపీ నాయకులు నేతింటి జ్యోతీశ్వరరావు, కంచు దాలినాయుడు తదితరుల ప్రమేయంతో చింతలపేటలోని పాత పంచాయతీ కార్యాలయం భవనంలోకి సచివాలయాన్ని మార్పు చేశారు. దీంతో ఆయా గ్రామాలత ప్రజలు, నాయకులు మండిపడుతున్నారు. అందరికీ అందుబాటులో ఉండే దండేవలసలోనే సచివాలయాన్ని కొనసాగించాలని పేడాడ శశిభూషణరావు, పంగ బాలసుందరరావు, కంచు శ్రీరాములు తదితరులు కోరారు. ఈ మేరకు నూతన సచివాలయం భవనంలోనే విధులు నిర్వహించేలా సిబ్బందిని ఆదేశించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

జాబ్‌మేళాలో 47 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మంగళవారం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మూడు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు 119 మంది యువత హాజరు కాగా, నైపుణ్యం ఆధారంగా 47 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాలు లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి వంశీకృష్ణ, అధికారులు సంతోష్, కామేశ్వరరావు, స్వప్న పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



జెడ్పీ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఈఓ

అరసవల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిసరాల్లో మొక్కలను నాటడాన్ని మనమంతా బాధ్యతగా స్వీకరించాలని జెడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇంజినీర్స్‌డే సందర్భంగా ఇంజినీర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీఎల్‌డీఓ వాసుదేవరావు, డీపీఆర్‌సీ కో–ఆర్డినేటర్ వెంకటరాజు, పీఐయూ ఈఈ కె.జి.జె.నాయుడు, పి.ఆర్.జేఏసీ సెక్రటరీ జనరల్ కేసీహెచ్ మహంతి, కోశాధికారి బి.కృష్ణారావు, టెక్నికల్ ఆఫీసర్ డి.వి.గోపీకృష్ణ, ఇంజినీర్లు కె.హేమలత, కె.ఎస్.చలపతిరావు, ఎస్.కోదండరావు, బి.వి.విశ్వనాథం పాల్గొన్నారు.

పిండిమిల్లు మూసివేత



పిండి మిల్లుకు తాళాలు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: స్థానిక బొంతలవీధిలోని పిండి మిల్లు ఎట్టకేలకు మంగళవారం మూతపడింది. పంచాయతీ సిబ్బంది సోమవారం నోటీసులు ఇచ్చి మంగళవారం పిండి మిల్లు యజమాని సమక్షంలో తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వులతో ఏడాది క్రితం పంచాయతీ అధికారులు ఈ మిల్లును సీజ్ చేశారు. అయితే ఇటీవల కొందరు టీడీపీ నేతలు మిల్లు తాళాలు తీసి రన్ చేసిన విషయం విదితమే. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

నిద్ర మత్తులో కానిస్టేబుల్!

- పరారైన గంజాయి సరఫరాదారుడు

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జిల్లాకేంద్రంలో 22 కిలోల గంజాయితో పట్టుబడిన తొమ్మిది మంది యువకులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మరో ముగ్గురు దొరకాల్సివుందని ఎస్పీ విలేకరుల సమావేశంలో చెప్పారు. అయితే దీనికి ముందు రోజు, విచారణ నిమిత్తం ఒకటో పట్టణ పోలీసుల అదుపులో ఉన్న ఓ యువకుడు పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన తొమ్మిది మందితో పాటు నగరానికి చెందిన గంజాయి సరఫరా చేసే మరో యువకున్ని పోలీసులు అదే రోజు అదుపులోకి తీసుకున్నారు. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఆ యువకుడు తప్పించుకుని పారిపోయినట్లు తెలుస్తోంది. సదరు యువకుడు మృతిచెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు అన్న విషయం తెలియడంతో పోలీసులే తప్పించారా..? అనే కోణం కూడా నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం జిల్లా ఎస్పీ దృష్టికి అప్పట్లోనే వెళ్లడంతో సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

సానుకూల ఆలోచనలతో ముందుకుసాగాలి



పోస్టర్ ఆవిష్కస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: యువత సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని, ప్రతికూల ఆలోచనలు మానసిక సంఘర్షణకు దారితీస్తాయని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాలధన బాలాజీ అన్నారు. ఎస్‌ఎంపురం క్యాంపస్‌లో మంగళవారం స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో 'జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం' నిర్వహించారు. ప్రత్యేక ఫ్లెక్సీలను ప్రదర్శించి విద్యార్థులకు జీవితం విలువ, క్షణికావేశం వల్ల కలిగే నష్టాలు వివరించారు. మానసిక ఆరోగ్య వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఎంతో మందికి విషాదాన్ని మిగుల్చుతుందన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు కౌన్సెలింగ్ తీసుకుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేత గోకర్ణపురం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కంచిలి మండలం గోకర్ణపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. స్థానిక భేతాళ యువజన సంఘం 23వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. కవిటి మండలం బొరివంక, కవిటి ఉన్నత పాఠశాలలు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో బసవ లిఖిత(ఆర్.బెలగాం), బి.తునూజ(జగతి) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, వ్యాసరచన పోటీల్లో పి.జయలక్ష్మి(రాజపురం, ఏపీ మోడల్ స్కూల్), కె.జగన్(బూర్జపాడు) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానందరెడ్డి, సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్, వార్డు మెంబర్ ఉప్పాడ నాగమ్మ, ఆశి వీధి గ్రామ పెద్దలు, నిర్వాహకులు బహుమతులు అందజేశారు.